

కరీంనగర్ టికెట్ బండి సంజయ్‌కే..

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

భారతీయ జనతా పార్టీ లోక్ సభ ఎన్నికల్లో పోటీకి నిలిపే అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటించింది. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే శనివారం సాయంత్రం 195 మంది అభ్యర్థులతో తొలి జాబితాను ప్రకటించగా, అందులో తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారు తొమ్మిది మంది ఉన్నారు. కరీంనగర్ లోక్ సభ స్థానం నుంచి మళ్లీ ఆపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, సిట్టింగ్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కే అవకాశం కల్పించారు. జిల్లాకు చెందిన మాజీ మంత్రి ఈటల రాజేందర్‌కు మల్కాజిగిరి టికెట్ దక్కింది. అధికారికంగా శనివారం వరకు టికెట్ ఎవరికి ఇచ్చేది ప్రకటించకున్నా కరీంనగర్ స్థానంలో తానే పోటీ చేయడం ఖాయమన్న ధీమాతో బండి సంజయ్‌కుమార్ నెల రోజుల క్రితం నుంచే లోక్‌సభకు పోటీ చేసేందుకు సన్నద్ధమవుతూ వచ్చారు. నియోజక వర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో విస్తృత పర్యటనలు చేసి పార్టీ నాయకులను, కార్యకర్తలను ఎన్నికలకు సమాయత్తం చేస్తు సమావేశాలు నిర్వహించారు. ప్రజాహిత యాత్రను చేపట్టి తొలి విడతలో 119 కిలోమీటర్ల పొడవునా సిరిసిల్ల, వేములవాడ నియోజక వర్గాల పర్యటనను పూర్తి చేసుకుని ప్రస్తుతం మలివిడత యాత్రలో ఉన్నారు. ఈ నియోజకవర్గం నుంచి కిసాన్ మోర్చా జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి పొల్సాని సుగుణాకర్‌రావు పోటీ చేసేందుకు టికెట్ ఆశించి ముమ్మర ప్రయత్నాలు చేసినా చివరకు బండి సంజయ్‌కుమార్ దానిని తిరిగి దక్కించుకున్నారు. 2019లో మొదటిసారి కరీంనగర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసిన సంజయ్ 90 వేల ఓట్ల మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌పై గెలుపొందారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఓడిపోయినా లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం విజయం సాధించి ఏడాది తిరగక ముందే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పార్టీ పగ్గాలను చేపట్టారు. మూడేళ్లపాటు ఆ పదవిలో కొనసాగి రాష్ట్రంలో ప్రత్యామ్నాయ పార్టీ బీజేపీయేననే వాతావరణాన్ని తీసుకువచ్చారు. అధ్యక్ష పదవి నుంచి ఆయన వైదొలిగిన తర్వాత పార్టీ జాతీయ నాయకత్వం ఆయనకు జాతీయ ప్రధాన కార్యదర్శి పదవిని కట్టబెట్టింది. ప్రస్తుతం జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న కరీంనగర్, పెద్దపల్లి లోక్ సభ స్థానాలలో ముక్కోణపు పోటీ జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. బీఆర్ఎస్ ఇప్పటికే కరీంనగర్ స్థానంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అభ్యర్థిత్వాన్ని ప్రకటించగా, ఇప్పుడు బండి సంజయ్‌కుమార్ బీజేపీ అభ్యర్థిగా ఆ పార్టీ నాయకత్వం పేర్కొన్నది. త్వరలోనే కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించనుండగా ఇక్కడ ముక్కోణపు పోటీ ఖాయమైంది. ఆర్ఎస్ఎస్, ఏబీవీపీలో చురుకైన కార్యకర్తగా పనిచేసిన బండి సంజయ్‌కుమార్ కీలక పదవులు చేపట్టారు. యువజన విభాగమైన యువమోర్చాలో కూడా ఆయన చురుకైన నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. బీజేపీ అగ్ర నేత ఎల్‌కే అద్వాణీ రథయాత్రలో పాల్గొన్నారు. కరసేవలో సంజయ్ పాల్గొని హిందుత్వ వాదిగా ముద్రపడ్డారు. కరీంనగర్ మున్సిపల్ కార్పోరేషన్‌లో రెండు సార్లు కార్పొరేటర్‌గా పోటీ చేసి గెలుపొందిన ఆయన అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం రెండు సార్లు ఓడి పోయారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఏర్పాటు పట్ల ప్రజల్లో వ్యక్తమైన సానుకూలత హిందుత్వ వాదిగా పేరుపడ్డ సంజయ్‌కి కలిసి వచ్చింది. 2019 లోక్ సభ ఎన్నికల్లో ఆయన గెలుపొంది జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎదిగారు. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో గెలిస్తే కేంద్ర మంత్రి పదవి వరిస్తుందన్న ప్రచారం కార్యకర్తలు, నాయకుల్లో ఇప్పటికే జోరందుకోవడంతో ఆ విజయాన్ని ఖాయం చేసుకోవాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

- లోక్‌సభ అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటించిన బీజేపీ
- జిల్లా నుంచి ఇద్దరికి అవకాశం
- పెండింగ్‌లో పెద్దపల్లి

● ఈటల రాజేందర్‌కు మల్కాజ్‌గిరి

జిల్లాకే చెందిన బీజేపీ నాయకుడు ఆ పార్టీ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్‌కు ఆ పార్టీ అగ్రనాయకత్వం మల్కాజ్‌గిరి అభ్యర్థిత్వాన్ని ఖాయం చేసింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఈటల రాజేందర్ హుజూరాబాద్ నియోజక వర్గం నుంచే కాకుండా గజ్వేల్‌లో కూడా ముఖ్యమంత్రి కేసీఆర్‌పై పోటీకి దిగారు. ఈ రెండు స్థానాల్లోను ఆయన ఓడిపోయారు. మల్కాజ్‌గిరి నుంచి పలువురు సీనియర్లు ముఖ్యంగా పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి పొల్సాని మురళీధర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, మల్క కొమురయ్య పోటీపడ్డా పార్టీ జాతీయ నాయకత్వం ఈటల రాజేందర్ అభ్యర్థిత్వం వైపే మొగ్గు చూపింది. బీసీ నాయకుడిగా రాష్ట్ర వ్యాప్తంగా ఆయనకు ఉన్న సంబంధాల కారణంగా ఎన్నికల కమిటీ చైర్మన్‌గా నియమించిన నాయకత్వం ప్రస్తుతం లోక్‌సభకు కూడా పోటీకి దింపుతున్నది. జిల్లాకు చెందిన ఇద్దరికి తొలి జాబితాలో చోటు దక్కడంపై బీజేపీ జిల్లా శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతున్నది. పెద్దపల్లి ఎస్సీ రిజర్వుడ్ స్థానం నుంచి ఆ పార్టీ నాయకత్వం ఎవరికి అవకాశం కల్పిస్తుందోనన్న చర్చ ప్రస్తుతం ఊపందుకుంటున్నది.

నేటి నుంచి పల్స్ పోలియో

- జిల్లాలో ఐదేళ్లలోపు చిన్నారులు 89,273 మంది
- పంపిణీకి 545 కేంద్రాలు సిద్ధం



సుభాష్‌నగర్, మార్చి 2: జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అన్ని ఏర్పాట్లను చేసింది. ఇప్పటికే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ జిల్లా, మండల, గ్రామీణ స్థాయిలో సమన్వయ సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలను నిర్వహించింది. మారుమూల ప్రాంతాల్లో కూడా పల్స్ పోలియో కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో ఐదు సంవత్సరాలలోపు పిల్లలు 89,273 మందిని అధికారులు గుర్తించారు. వారికి పోలియో చుక్కలు వేయడానికి మొత్తం 545 కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిలో 150 పట్టణ ప్రాంతాల్లో కాగా, 395 గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. 27 మొబైల్ టీంలు 56 రూట్లకుగాను 56 రూట్ సూపర్‌వైజర్లను ఏర్పాటు చేశారు. బస్టాండ్, రైల్వే స్టేషన్లలో ఎనిమిది కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో 217 హైరిస్క్ పాయింట్స్, మైగ్రేట్ పాయింట్స్ (తప్పిపోవడానికి అవకాశమున్న ప్రాంతాలు)ను గుర్తించారు. ఈ ప్రాంతల్లో మున్సిపల్ సిబ్బంది సహకారంతో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. జిల్లాకు 5,580 వాయిల్స్ అవసరంకాగ, 6,500 వాయిల్స్ సిద్దంగా ఉన్నాయని వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు వెల్లడించాయి. 2,216 మందిని వ్యాక్సినేటర్లను గుర్తించి శిక్షణ ఇచ్చారు. వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పట్టణ ప్రాంతాల్లో నర్సింగ్ విద్యార్థులు, రిసోర్స్ పర్సన్లను పల్స్ పోలియో కోసంవినియోగించుకోనున్నారు. ఈనెల 4, 5తే దీల్లో వ్యాక్సినేటర్లు ఇంటింటికి వెళ్లి తప్పి పోయిన పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని మాతా శిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)లో ఆదివారం ఉదయం 9.30 గంటలకు కలెక్టర్ పమేలా సత్పతి ప్రారంభిస్తారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత తెలిపారు

అన్ని ఏర్పాట్లు చేశాం..

\- డాక్టర్ సుజాత, డీఎంహెచ్‌వో

పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయడానికి అన్ని ఏర్పాట్లు చేశాం. వివిధ దశల్లో వ్యాక్సినేటర్లకు శిక్షణ ఇచ్చాం. మొబైల్ టీంలు కూడా సిద్ధంగా ఉన్నాయి.

ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ ఫ్లాగ్‌మార్చ్



ఆర్‌ఏఎఫ్ బలగాలు ఉపయోగిస్తున్న ఆయుధాలను పరిశీలిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

కరీంనగర్ క్రైం, మార్చి 2: నగరంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలు శనివారం కవాతు నిర్వహించాయి. కరీంనగర్ కోర్టు చౌరస్తా నుంచి ప్రారంభమైన ఫ్లాగ్‌మార్చ్ పద్మనగర్‌కు కొనసాగింది. సాలెహ్‌నగర్ నుంచి కొత్తపల్లి మండలంలోని ఎలగందల్ గ్రామం వరకు మరో యూనిట్ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ అడిషనల్ కమాండెంట్ బిస్వరంజన్‌సాహు, అడిషనల్ డీసీపీ రాజు, ఏసీపీ నరేందర్, సీఐలు రవీంద్రరోషన్, లలితగోనారాయణ్, రమేష్, శ్రీనివాస్, సురేష్ పాల్గొన్నారు.

● ఫెమిలైజేషన్ ఎక్సర్‌సైజ్‌లో భాగంగా ఎరేడ్ గ్రౌండ్‌లో డిఫెన్స్ అకాడమీ, ఎన్‌సీసీ, స్కౌట్స్‌గైడ్స్ విద్యార్థులకు ఆర్ఎఎఫ్ బలగాల విధులు, వారు ఉపయోగించే వాహనాలు, ఆయుధాలు, పరికరాలపై అవగాహన కల్పించారు.

ప్రజల గుండెల్లో నిలిచిన శ్రీపాదరావు

● కలెక్టర్ పమేలా సత్పతి



శ్రీపాదరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రజల గుండెల్లో నిలిచిన గొప్ప రాజకీయ నాయకుడు శ్రీపాదరావు అని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి ఉత్సవాలు అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీపాదరావు పేదల పెన్నిధి అని, గొప్ప రాజకీయ వేత్త స్పీకర్ పదవికే వన్నె తెచ్చారన్నారు. నిరంతరం పేదల సంక్షేమం కోసం కృషి చేశారని, గొప్ప రాజకీయ వేత్తగా అందరి మన్ననలు పొందారన్నారు. సర్పంచ్ పదవి నుంచి అంచెలంచెలుగా ఎదిగి శాసన సభ్యుడిగా పలుమార్లు గెలిచి మంథని నియోజక వర్గం అభివృద్ధి కోసం అహర్నిషలు కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా అత్యుత్తమ సేవలందిస్తున్న సాహితీవేత్తలు, కవులు, నటులు, ప్రముఖులను కలెక్టర్ ఘనంగా సన్మానించారు. రచయిత గంద్ర లక్ష్మణ్‌రావు, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత వరాల ఆనంద్, ఎస్ సంపత్‌కుమార్, గొలపల్లి రవీందర్, రతన్‌కుమార్, ఇస్మాయిల్, దయానంద్‌గాంధీ, మంచాల రమేష్, మానేరు విద్యా సంస్థల చైర్మన్ అనంతరెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీఆర్వో పవన్‌కుమార్, ఆర్డీవో కె మహేశ్వర్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, డీఎంహెచ్‌వో సుజాత, సంక్షేమ అధికారి సరస్వతి, డీఆర్డీవో శ్రీధర్, స్పోర్ట్స్ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, ఉద్యోగ సంఘాల నేతలు దారం శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్‌రావు, రాష్ట్ర వృత్తి కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృపాదానం పాల్గొన్నారు.

● ఘన నివాళి

కరీంనగర్ బస్టాండ్ వద్ద మాజీ స్పీకర్ స్వర్గీయ శ్రీపాదరావు విగ్రహానికి కలెక్టర్ పమేలా సత్పతి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

కరీంనగర్‌టౌన్, మార్చి 2: ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతు న్నాయి. శనివారం జరిగిన ఇంటర్ సెకండ్ ఇయర్ ఇంగ్లీష్ పరీక్షకు 15,146 మంది విద్యార్థులకు 13,438 మందిపరీక్షలు రాశారు.546 మంది గైర్హాజరయ్యారు.

5న ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనపై అవగాహన సదస్సు

గణేశ్‌నగర్, మార్చ్ 2: ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనను జిల్లాలో అమలు చేసేందుకు కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి అవగాహన సదస్సును 5న కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ బి నవీన్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. కుల వృత్తులు చేసేవారు ఈ సదస్సుకు హాజరు కావాలని కోరారు. సదస్సులో జిల్లాస్థాయి అధికారులు, కేంద్ర ప్రభుత్వ సంస్థల అధికారులు పాల్గొంటారని తెలిపారు.

'గృహజ్యోతి' ప్రారంభం

● జీరో బిల్లును వినియోగదారులకు అందించిన టీఎస్ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి



గృహజ్యోతి జీరో బిల్లును ప్రారంభించి వినియోగదారులకు అందజేస్తున్న టీఎస్ఎన్పీడీసీఎల్ సీఎండి వరుణ్ రెడ్డి ఐఏఎస్

గణేశ్‌నగర్, మార్చ్ 2: కరీంనగర్ పోచమ్మవాడలో గృహజ్యోతి పథకాన్ని శనివారం టీఎస్ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్‌కార్డు ఉండి ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకుని, 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించిన వారందరికీ జీరో బిల్లు వస్తుందని తెలిపారు. కొంతమంది విద్యుత్ వినియోగదారులు ప్రజా పాలనలో నంబర్ తప్పుగా వేయడం వల్ల, కొంతమంది రేషన్ కార్డు సబ్‌మిట్ చేయకపోవడం, సెల్ నంబర్ నమోదు చేయకపోవడం, వివిధ కారణాల వల్ల వారి దరఖాస్తులు నమోదు కాలేదన్నారు. వారి కోసం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. అక్కడికి వెళ్లి ఆధారాలు చూపించి వారి దరఖాస్తును అప్‌డేట్ చేయించుకోవచ్చని తెలిపారు. అంతకుముందు సీఎండీ వరుణ్‌రెడ్డి, చీఫ్ ఇంజనీర్ రాజుచౌహాన్‌కు ఎస్ఈ వడ్లకొండ గంగాధర్, డీఈ రాజం, ఏడిఈ సాయినేని నరేందర్, ఏఈ శ్రీనివాస్, కార్పొరేటర్ ఐలేందర్ యాదవ్ స్వాగతం పలికారు.

ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేస్తా

ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి) ప్రజల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తానని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు బండి సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం బీజేపీ జాతీయ నాయకత్వం కరీంనగర్ లోక్ సభ స్థానానికి తన అభ్యర్థిత్వం ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జమ్మి కుంటలో ఆయన మాట్లాడుతూ ప్రజాహిత యాత్ర ఇక్కడికి రాగానే లోక్‌సభ అభ్యర్థిగా తన పేరును ప్రకటించ డంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ తన జీవితం కరీంనగర్ ప్రజలకే అంకితమన్నారు. కరీం నగర్ లోక్‌సభ అభ్యర్థిగా ప్రకటిం చినందుకు ప్రధాని మోదీకి, జాతీయ నాయకత్వానికి ధన్యవా దాలు తెలిపారు. ప్రజలు గర్వపడే విధంగా పోరాటాలు చేశామ న్నారు. కరీంనగర్ నుంచి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కేంద్రం నుంచి అధిక నిధులు తీసుకువచ్చి పార్లమెంటు నియోజక వర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కరీంనగర్ ప్రజలు తలెత్తుకుని తిరిగేలా పనిచేస్తానన్నారు. కరీంనగర్ నియోజక వర్గ ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న బండి సంజయ్

● కేసీఆర్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు..

జమ్మికుంట/జమ్మికుంట రూరల్: కాళేశ్వరంలో లక్ష కోట్లు దుర్వినియోగం చేసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పాలని ఎంపీ బండి సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. శనివారం జమ్మికుంట మండలం నాగారం ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ప్రజాహిత యాత్ర ప్రారంభించారు. నగురం, వావిలాల, పాపక్కపల్లి, శంభునపల్లి, తనుగుల, గంద్రపల్లి, నాగంపేట, శాయంపేట, కొత్తపల్లి, జమ్మి కుంట వరకు ప్రజాహిత యాత్ర సాగింది. అనంతరం పట్టణంలోని గాంధీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ కేసీఆర్ కుటుంబం ఆస్తులను ఇప్పటి వరకు ఎందుకు జప్తు చేయలేదో తెలంగాణ ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. ఆరు గ్యారంటీల మీద బీఆరెస్ కొట్లాడడం లేదని, అవినీతి కప్పి పుచ్చుకు నేందుకు బీఆర్ఎస్ డ్రామాలు ఆడుతుందన్నారు. కాంగ్రెస్, బీఆరెఎస్ కాంప్రమైజ్ రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. ఆరు గ్యారంటీలను కాకి ఎత్తుకెళ్లే రోజులు రాబోతున్నాయని, ఎన్నికల సాకుతో హామీలు దాట వేసే ప్రయత్నం చేయబోతు న్నారని తెలిపారు. బీజేపీ గెలిస్తే మోదీనే ప్రధానమంత్రి అవుతారని, కాంగ్రెస్ గెలిస్తే ఎవరు ప్రధాని అవుతారో చెప్పే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. కేంద్రం నుంచి హుజూరా బాద్ ఆసెంబ్లీకి ఇప్పటికే 480 కోట్లకు పైగా తీసుకు వచ్చానని, మళ్లీ గెలిపిస్తే అధిక నిధులు తీసుకు వస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 80 రోజులైనా ఇప్పటి వరకు కొత్త రేషన్ కార్డులు ఎందుకు ఇవ్వలేదో చెప్పాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగా పార్లమెంట్ ఎన్నికల్లో తప్పు చెయవద్దని, మోదీని మళ్లీ ప్రధాని చేయాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. దళిత బంధు కోసం 4,900 మంది దరఖాస్తు చేసుకుంటే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. వారందరికి దళిత బంధు వచ్చే వరకు పోరాటం చేస్తానని హామి ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి, ఎరబెల్లి సంపత్‌రావు, మాడ గౌతంరెడ్డి, తాళ్లపల్లి శ్రీనివాస్, గంద్ర నళిని, మూగ జయశ్రీ, ప్రవీణ్‌రావు, సంపెల్లి సంపత్‌రావు, జీడి మల్లేష్, ఆకుల రాజేందర్, శీలం శ్రీనివాస్ పాల్గొన్నారు.

నకిలీ చిరునామా కేసులో మీ సేవా కేంద్రం నిర్వాహకుడు, మరొకరి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, మార్చి 2: నకిలీ చిరునామాతో పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసిన కేసులో రుద్రంగి మండల కేంద్రంలో గల గాయత్రి మీ సేవా కేంద్రం యజమాని లోలావత్ పరమజిత్‌ను, కథలాపూర్ మండలం కలికోట గ్రామానికి చెందిన దరావత్ షెర్మాన్‌ను శనివారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్పీ అఖిల్ మహాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. వీరి వద్ద నుంచి కంప్యూటర్, స్కానర్, ప్రింటర్, ఒరిజినల్, నకిలీ ఆధార్‌కార్డు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరు పాస్‌పోర్ట్ దరఖాస్తు విషయంలో తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి ప్రభుత్వ ఉద్యోగులను తప్పు దోవ పట్టించారని తెలిపారు. కథలాపూర్ మండలంలోని కలికోట గ్రామానికి చెందిన దరావత్ షెర్మాన్ అనే వ్యక్తి గతంలో ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లి అక్కడ జైలు శిక్ష అనుభవించాడు. తిరిగి స్వదేశానికి వచ్చి ఎలాగైనా మళ్లీ విదేశాలకు వెళ్లాలని పాస్‌పోర్ట్‌కోసం మీసేవా కేంద్రం ద్వారా దరఖాస్తు చేసుకున్నాడు. ఇందులో భాగంగా స్పెషల్ బ్రాంచి పాస్‌పోర్ట్ ఎంక్వైరీలో భాగంగా షెర్మాన్ సమర్పించిన పత్రాలు అనుమానంగా భావించి సంబంధిత కానిస్టేబుల్ దేవరాజు రుద్రంగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యా దు మేరకు విచారణ చేపట్టగా రుద్రంగిలోని గాయత్రి మీసేవా కేంద్రం నిర్వాహకుడు లోలావత్ పరమజిత్ ద్వారా ఆధార్ కార్డులో షెర్మాన్‌కు బదు లుగా షెర్మాన్‌నాయక్ అని చిరునామా కలికోట గ్రామానికి బదులుగా రుద్రం గిగా మార్చడమే కాకుండా విద్యార్హతలు, పుట్టిన తేదీలు మార్చి పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేశారని ఆయన తెలిపారు. ఈ విధంగా నకిలీ చిరునామా పెట్టి దరఖాస్తు చేసిన వ్యక్తితో పాటు మీసేవా కేంద్రం నిర్వాహకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు.

52మంది మందుబాబులకు జైలు శిక్ష, జరిమానా

సిరిసిల్ల క్రైం, మార్చి 2: సిరిసిల్ల పట్టణంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 52మంది మందుబాబులకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ శనివారం తీర్పు ఇచ్చారని టౌన్ సీఐ రఘుపతి తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 26మందికి ఒక్కొక్కరికి రెండురోజుల జైలు శిక్షతో పాటు మూడువేల రూపాయల జరిమానా విధించారని తెలిపారు. మరో 25మంది మందుబాబులకు ఒక్కొక్కరికి మూడు వేల రూపాయల చొప్పున జరిమానా విధించారని తెలిపారు. మందుబాబులకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడితే భవిష్యత్తులో వచ్చే ఉద్యోగ అవకాశాలు, ఉపాధి అవకాశాలకు ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోలీస్ కస్టడీలో అక్షర చిట్‌ఫండ్ ఛైర్మన్, డైరెక్టర్లు

కరీంనగర్ క్రైం, మార్చి 2: ఖాతాదారులకు సకాలంలో డబ్బు చెల్లించకుండా మోసగించి చిట్‌ఫండ్ కంపెనీలో ఖాతాదారులు జమచేసుకున్న డబ్బుతో సొంత ఆస్తులు కూడబెట్టిన కేసులో అక్షర చిట్‌ఫండ్ ఛైర్మన్ పేరాల శ్రీనివాసరావు, ఎస్ కొండాల్‌రావు, ఉప్పల రాజేందర్‌లను ఒకటవ టౌన్ పోలీసులు ఆరు రోజుల కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు. సీతారాంపూర్‌కు చెందిన ప్రభుత్వ ఉద్యోగి శ్రీరాం వెంకట్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో ఫిబ్రవరి 21న అక్షర చిట్‌ఫండ్ ఛైర్మన్, డైరెక్టర్లపై కేసు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు వారిని అదే రోజు అరెస్టు చేసి జైలులో రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన మరిన్ని కీలక ఆధారాలు సేకరించేందుకు నిందితుల్లో ముగ్గురిని పోలీసులు కోర్టు ద్వారా శుక్రవారం సాయంత్రం కస్టడీకి తీసుకున్నారు. ఈ నెల 6వ తేదీ సాయంత్రం వరకు వీరిని విచారించనున్నారు. కరీంనగర్ రాజీవ్‌చౌక్, కోతిరాంపూర్, జ్యోతినగర్‌లలో ఉన్న అక్షర చిట్‌ఫండ్ బ్రాంచీలలో తనిఖీలు నిర్వహించి పలు కీలక డాక్యుమెంట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

గంగాధర, మార్చి 2: కారు ఇంటి పిల్లరును ఢీకొన్న ఘటనలో గంగాధర మండలం కాచిరెడ్డిపల్లికి చెందిన ఇద్దరు యువకులు మృతి చెందారు. గ్రామస్థుల వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన కోల విక్రమ్(31), కుంట రమేష్(32)లతో పాటు మరో ఇద్దరు శనివారం వేకువ జామున కారులో తిరుపతి దర్శనానికి బయలు దేరారు. వీరు ప్రయాణిస్తున్న కారు సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో ఓ ఇంటి పిల్లరును ఢీకొట్టింది. ఈ ఘటనలో కుంట రమేష్ అక్కడి కక్కడే మృతి చెందగా విక్రమ్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కారులోని మరో ఇద్దరికి తీవ్రంగా గాయాలైనట్లు సమాచారం. ఇద్దరు యువకుల మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరి మృతి

పెద్దపల్లి రూరల్,మార్చి 2 : మండలంలోని రంగాపూర్ గ్రామ శివారులో ద్విచక్రవాహనాలు ఢీకొని సూర్నపల్లి రాజయ్య (56) మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం సబ్బితం గ్రామానికి చెందిన సూర్నపల్లి రాజయ్య స్వగ్రామం నుంచి పెద్దపల్లికి ద్విచక్రవాహనంపై వస్తుండగా మరొకరు రంగాపూర్ గ్రామ శివారులో ద్విచక్రవాహనంతో వెనుకనుండి ఢీకొట్టాడు. రాజయ్య తలకు తీవ్ర గాయాలు కాగా పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. మృతుని కుమారుడు సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి తెలిపారు.

కుటుంబ పాలన, కుంభకోణాలతో రాష్ట్రం కుదేలు

- అబద్ధాల పునాదులపై పురుడు పోసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- దేవుణి మాన్యాలను కబ్జా చేస్తే బీజేపీ చూస్తూ ఊరుకోరు
- బీజేపీ ఫ్లోర్ లీడర్, నిర్మల్ ఎమ్మెల్యే ఏల్లేటి మహేశ్వర్‌రెడ్డి



వేములవాడలో మాట్లాడుతున్న నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

వేములవాడ టౌన్, మార్చి 2: కుటుంబ పాలన, కుంభకోణాలతో రాష్ట్రం కుదేలైందని బీజేపీ ఫ్లోర్ లీడర్, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రపంచ దేశాల్లో భారత్‌కు ప్రత్యేక గుర్తింపు వచ్చిందంటే ప్రధాని మోదీతోనేనని, ప్రపంచ దేశాల్లోనే భారత్ మూడవ ఆర్థిక వ్యవస్థగా ఎదగబోతుందంటే ప్రధాని మోదీ సంకల్పానికి నిదర్శనమన్నారు. దేశంలో రాబోయేది రామరాజ్యమని మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజాసంగ్రామ యాత్ర ముగింపు కార్యక్రమంలో భాగంగా వేములవాడకు వచ్చిన ఆయన సమావేశంలో మాట్లాడారు. విజయ సంకల్ప యాత్ర ఒక కొత్త మలుపునకు నాంది పలికిందని అన్నారు. రాజకీయ చరిత్రలో వేడిపుట్టించిందని, రాష్ట్రంలో అత్యధిక సీట్లు గెలువబోతున్నామని విశ్లేషకులు చెబుతున్నారని అన్నారు. వేములవాడకు వచ్చిన తరువాతనే ఓ శుభవార్త తెలిసిందని, రాష్ట్రంలో 9 మంది అభ్యర్థులను ప్రకటించగా కరీంనగర్ ఎంపీ అభ్యర్థిగా బండి సంజయ్ పేరు ఖరారు చేశారని వెల్లడించారు. సుమారు 2 లక్షల మెజార్టీతో బండి సంజయ్ గెలువబోతున్నాడని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నో యేళ్లుగా రాష్ట్రం కుటుంబ పాలనతో విసుగిపోయిందన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టులో లక్షల కోట్ల కుంభకోణం జరిగిందని ప్రగల్భాలు పలికి అధికారంలోకి వచ్చిన తరువాత సీబీఐ ఎంక్వైరీ కోసం ఒక్క లెటర్ ఇవ్వమంటే ఎందుకు ఇస్తలేరని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డికి కాళేశ్వరం ప్రాజెక్టులో ఎవరైనా బంధువులు, మిత్రులు కానీ ఉన్నారా అని ప్రశ్నించారు. నాకు ఒక్క లెటర్ ఇస్తే 48 గంటల్లో సీబీఐ ఎంక్వైరీ పెట్టిస్తానని, దమ్ముంటే ఒక్క లేటర్ ఇవ్వు రేవంత్‌రెడ్డి అని సవాల్ విసిరారు. అధికారం చేజిక్కించుకునేందుకు నోటికి వచ్చిన అబద్ధాలు చెపుతూ అధికారంలోకి వచ్చారని, కేవలం బ్లాక్‌మెయిల్ చేయడం కోసమే ముఖ్యమంత్రి పదవి తీసుకున్నాడని ఆరోపించారు. నాలుగు వందల పైచిలుకు హామీలను ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క హామీ కూడా అమలు చేయలేదని అన్నారు. ఆరు గ్యారంటీల పేరు చెప్పి నాలుగు అమలు చేశామని అంటున్నారు. అది సాధ్యం కాదని ఆరు గ్యారంటీలు అమలు జరగాలంటే రూ.1.65 లక్షల కోట్లు కావాలని, కానీ రూ.53 వేల కోట్లు మాత్రమే కేటాయించారని అన్నారు. గ్యారంటీల అమలు ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. మహిళలకు రూ.2500 ఇస్తామని, నిరుద్యోగ యువతకు భృతి ఇస్తామని అసెంబ్లీలో మాట్లాడలేదని, వాటిపై తాను ప్రశ్నిస్తే ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మేము హామీ ఇవ్వలేదని మాట దాటవేసిన మహానీయులు అని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ గాడితప్పి అతలాకుతలం అవుతుందని, ప్రధాని మోదీ రూ. 9 వేల కోట్ల ఇస్తేనే ప్రభుత్వం వడ్డీలు, జీతాలు వెల్లదీస్తోందన్నారు. అలాంటి మోదీని విమర్శించే అర్హత రేవంత్‌రెడ్డికి లేదని అన్నారు. మరో మారు ప్రధానిని విమర్శిస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో సీతారాములకు సంబంధించిన 11 వందల ఎకరాలను దేవుడి మాన్యాన్ని అక్కడున్న రంజిత్‌రెడ్డి, కేటీఆర్ కలిసి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని ఇండస్ట్రియల్ పేరుతో రూ.20 లక్షల నుంచి రూ. 15 లక్షలకు ఎకరం కేటాయించి కమిషన్‌లు పొందారని ఆరోపించారు. దేవుడి మాన్యాల జోలికి వస్తే ఖబడ్దార్, బీజేపీ పార్టీ ఊరుకోదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతర మతాలకు చెందిన వారి దేవుళ్లకు చెందిన భూమిని తీసుకునే దమ్ము పాలకులకు ఉందా అని ప్రశ్నించారు. హైదారాబాద్ నడిబొడ్డు లోని జూబ్లీహిల్స్‌లో అక్కడి ఎంపీ అని చెప్పుకుని తిరిగే రంజిత్‌రెడ్డి 400 ఎకరాల హనుమాన్ దేవాలయాన్ని కూలగొట్టి అక్కడి భూమిని కబ్జా చేసి అపార్ట్‌మెంట్ నిర్మాణం చేస్తున్నాడని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దమ్ము ధైర్యం వుంటే ఆధారాలతో సహా ఇస్తాను దాన్ని నిలిపివేసి దేవాలయానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. నిర్మల్ నియోకవర్గంలో సైతం శ్రీకృష్ణకుని చెందిన భూమి సైతం కబ్జా చేస్తే సర్వే చేసి వెలికి తీస్తున్నానని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు, దీప, జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, మైపాల్‌రెడ్డి, ఎర్రం మహేష్, మల్లికార్జున్, కుమ్మరి శంకర్, గురుమూర్తి శివశంకర్, సంతోష్‌బాబు, జక్కుల తిరుపతి తదితరులు ఉన్నారు.

రాజన్నను దర్శించుకున్న మహేశ్వర్‌రెడ్డి

వేములవాడ టౌన్ : వేములవాడ రాజరాజేశ్వరస్వామిని శనివారం సాయంత్రం బీజేపీ శాసనసభాపక్ష నేత నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు ఆశీర్వదించగా, ప్రొటోకాల్ పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి లడ్డు ప్రసాదం అందజేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, నాయకులు రేగుల సంతోష్‌బాబు, నామాల శేఖర్, సగ్గు రాహుల్ ఉన్నారు.

కొనసాగుతున్న న్యూరో డాక్టర్ల రాష్ట్ర సదస్సు

సుభాష్‌నగర్, మార్చి 2: శాతవాహన న్యూరో డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని వీ కన్వెన్షన్‌లో ఈ నెల 1న ప్రారంభమైన న్యూరో డాక్టర్ల రాష్ట్రస్థాయి సదస్సు కొనసాగుతోంది. ఈ సదస్సులో శనివారం నిమ్స్ ప్రొఫెసర్ విజయసారథి పాల్గొని ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెన్నెముక చికిత్సలో కోత లేకుండా ఎండోస్కోపీ ద్వారా శస్త్ర చికిత్సలు ఎలా చేయాలని వివరించారు. అనంతరం కిమ్స్ హాస్పిటల్ న్యూరో సర్జన్ డాక్టర్ మానస్ పాణిగ్రహీ మాట్లాడుతూ గతంలో క్యాన్సర్ ట్యూమర్ చికిత్స తీసుకోవాలంటే ఆరు వారాలు అవసరం ఉండేదన్నారు. ప్రస్తుతం రేడియో సర్జరీ ద్వారా రెండు నుంచి ఐదు రోజులు మాత్రమే చికిత్స తీసుకుంటే సరిపోతుందన్నారు. రోబోటిక్ సర్జరీ, ఎండోస్కోపీ, నావిగేషన్, ఆల్ట్రాసోనిక్, ఆస్పరేటీవ్, లేజర్‌ల ద్వారా అత్యాధునిక చికిత్స అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. వాటితో పాటు మైక్రోస్కోప్ సర్జరీలు అందుబాటులోకి రావడం శుభపరిణామమన్నారు. ప్రస్తుతం సర్జరీ అవసరం లేకుండానే రేడియేషన్‌తో చికిత్సలు అందుబాటులోకి వచ్చాయన్నారు. దాంతో పేషంట్ ఒక్క రోజులోనే డిశ్చార్జి అవుతున్నారని తెలిపారు. స్పైనల్ కార్డు స్టీమ్‌లెటర్ అందుబాటులోకి రావడం పక్షవాతానికి గురైన వ్యక్తులకు ఎంతో దోహదం చేస్తుందన్నారు. సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ దాసరి శ్రీనివాస్ మాట్లాడుతూ కరీంనగర్‌లో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించడం సంతోషకరమన్నారు. న్యూరో విభాగంలో నూతనంగా వస్తున్న మెళకువలను నేర్చుకోవడానికి ఇలాంటి సదస్సులు ఎంతో దోహదపడతాయన్నారు. డాక్టర్ దాసరి వెంకటేష్ మాట్లాడుతూ రోడ్లు సరిగా లేకపోవడం, ఎక్కువ సేపు ప్రయాణాలు చేయడంతోనే వెన్నుముక సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. వాటితోపాటు ఎక్కువసేపు ఒకే చోట కూర్చోవడం, సరైన ఆహారం తీసుకోకపోవడం, ఒత్తిడికి గురికావడం కూడా కారణమన్నారు. వైద్యుల సలహాలు, సూచనలు తీసుకుంటే ప్రాథమిక దశలోనే నివారించవచ్చన్నారు. కార్యక్రమాన్ని కరీంనగర్‌కు చెందిన సీనియర్ వైద్యులు డాక్టర్ రమణారెడ్డి, డాక్టర్ పీవీకే కిషోర్, డాక్టర్ దాసరి శ్రీనివాస్, డాక్టర్ జొన్నల శ్రీనివాస్, డాక్టర్ రంజిత్ కుమార్, డాక్టర్ సంజయ్‌లు పర్యవేక్షిస్తున్నారు.

12 వరకు ఎం ఫార్మసీ, బీ ఫార్మసీ పరీక్ష ఫీజు గడువు

గణేశ్‌నగర్, మార్చి 2:ఎస్‌యూ పరిధిలోని ఎం ఫార్మసీ మొదటి సెమిస్టర్ మూడో సెమిస్టర్ విద్యార్థులు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా పరీక్ష రుసుం ఈనెల 12 వ తేదీ వరకు చెల్లించాలని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వి శ్రీరంగ ప్రసాద్ తెలిపారు. 300రూపాయల అపరాధ రుసుంతో 15వ తేదీ వరకు చెల్లించాలనిఅన్నారు. పరీక్షలను మార్చి లేదా ఏప్రిల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

●ఎస్‌యూ పరిధిలోని బీఫార్మసీ మొదటి సెమిస్టర్, ఏడో సెమిస్టర్ (రెగ్యులర్ సప్లిమెంటరీ) రెండో సెమిస్టర్, ఎనిమిదో సెమిస్టర్(సప్లిమెంటరీ) విద్యార్థులు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా పరీక్ష రుసుం ఈనెల 12వ తేదీ వరకు చెల్లించాలని పరీక్షల నియంత్రణాధికారి తెలిపారు. 300 రూపాయల అపరాధ రుసుంతో 15వ తేదీ వరకు చెల్లించాలని ఆయన అన్నారు.

రేపు ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు

సుభాష్‌నగర్, మార్చి 2: సెక్యూరిటీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఇంటర్నేషనల్ సంస్థలో 400ల ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, ఈ నెల 4న నగరంలోని అంబేద్కర్ స్టేడియం సమీపంలోని స్వశక్తి కళాశాలలో ఉదయం 10 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని డిఆర్‌డిఎ పిడి శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి ఆపై విద్యార్హతతో పాటు 19 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల పురుష అభ్యర్థులు అర్హులన్నారు. తమ బయోడేటాతో పాటు ఆధార్‌కార్డు, విద్యార్హతల జిరాక్స్ ప్రతులు తీసుకుని ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు 14 వేల నుంచి 21 వేల వరకు వేతనంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ బోనస్ గ్రాట్యుటీ అందజేస్తారన్నారు.

రేపు ఎస్సారార్ కళాశాలలో జాబ్ మేళా

గణేశ్‌నగర్, మార్చి 2: ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో తెలంగాణ స్కిల్స్ నాలెడ్జి సెంటర్ (టిఎస్‌కెసి) ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ, టిఎస్‌కెసి కో-ఆర్డినేటర్ సిహెచ్ మారుతి తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఆదర్శ నెక్సా షోరూం పాల్గొంటుందని తెలిపారు. డిగ్రీ పాసైన వారు అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు ఎస్సారార్ కళాశాల, టిఎస్‌కెసి సెంటర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ప్రైవేటీకరణ కోసమే నూతన విద్యావిధానం



సమావేశంలో మాట్లాడుతున్న నద్దునూరి అశోక్‌స్టాలిన్

భగత్‌నగర్, మార్చి 2: విద్య ప్రైవేటీకరణ కోసమే నూతన విద్యా విధానమని దీనిని ప్రజలందరూ వ్యతిరేకించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు నద్దునూరి అశోక్ స్టాలిన్ అన్నారు. శనివారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ మౌలిక సూత్రాలకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ) 2020 లోపాల పుట్ట అని విమర్శించారు. విద్య కాషాయీకరణ, ప్రైవేటీకరణ, కేంద్రీకరణ కోసమే నూతన విద్యా విధానమన్నారు. రాష్ట్ర విభజన హామీలను అమలు చేయడంలో విఫలమైన కరీంనగర్ ఎంపీ ఓట్లు ఎలా అడుగుతారని ఆయన ప్రశ్నించారు. ఎన్‌ఈపీ రద్దుకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపడు తున్నా మన్నారు. ప్రభుత్వం విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసి పేద, మధ్య తరగతి వర్గాలకు దూరం చేసే కుట్ర పన్ను తున్నాయన్నారు. దేశంలో జాతీయ విద్యావిధానం వల్ల 90శాతం మంది విద్యార్థులు నాణ్యమైన విద్యను పొందే హక్కును కోల్పోతారన్నారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామారపు వెంకటేష్, మచ్చ రమేష్, నగర నాయకులు సందీప్‌రెడ్డి, అడపా సాయికృష్ణ, వినయ్‌రెడ్డి, అజయ్ రాహుల్, నాని, సుధీర్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదంలో బీజేపీ నాయకుడు, మరో ఇద్దరిపై కేసు

సిరిసిల్ల క్రైం, మార్చి 2: సిరిసిల్ల పట్టణంలోని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడి భూమిని నకిలీ పత్రాలు సృష్టించి అక్ర మంగా కాజేసేందుకు ప్రయత్నించడమే కాకుండా చం పుతామని బెదిరించిన సంఘటనలో బీజేపీ నాయకుడితో పాటు మరో ఇద్దరిపై సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. సిరిసిల్ల డీఎస్పీ భీంశర్మ వివరా ల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని గూడూరి ప్రవీణ్‌కు చెందిన సర్వేనంబర్ 1562లో 363గజాల భూమిని అక్ర మించాలనే ఉద్దేశంతో తప్పుడు దస్తావేజులతో కె చందన భూమిని చౌటుపల్లి చంద్రశేఖర్‌కు జీపీఏ చేశారు. ఆ తర్వాత చౌటుపల్లి చంద్రశేఖర్ అదే భూమిని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డెబోయిన గోపికి విక్రయించారు. గోపి ఈ భూమిలో నుంచి 180గజాల భూమిని తిరిగి కె చందన కు రిజిస్ట్రేషన్ చేశారు. భూమిని తమకు అప్పగించాలని లేకుంటే చంపుతామని బెదిరించారని బాధితుడు బీఆర్ఎస్ రాష్ట్రనాయకుడు గూడూరి ప్రవీణ్ ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డెబోయిన గోపిని అరెస్ట్‌చేసి కోర్టులో హాజరుపరిచామని తెలిపారు. జిల్లాలో భూ కబ్జాలు చేస్తూ, నకిలీ పత్రాలు సృష్టించి బెదిరింపులకు పాల్పడే వారి సమాచారం ఇవ్వాలని, వారి నేర ప్రవృత్తిని ప్రజలు ధైర్యంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఆయన తెలిపారు.

జార్జియాలో వైద్య విద్యార్థిని మృతి


పంజాల రిచిత(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, మార్చి2: హుజూరాబాద్ మండలంలోని జూపాక గ్రామానికి చెందిన వైద్య విద్యార్థిని పంజాల రిచిత(20) అనారోగ్యంతో జార్జియాలో శనివారం మృతి చెందింది. గ్రామానికి చెందిన పంజాల రాజు కుమార్తె రిచిత జార్జియాలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కొద్ది రోజుల క్రితం రిచిత ఊపిరి తిత్తులకు ఇన్‌ఫెక్షన్ సోకి పరిస్థితి విషమించింది. తోటి విద్యార్థులు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


హరీష్ (ఫైల్)

మెట్‌పల్లి రూరల్, మార్చి, 02 : మండలంలోని వెల్లుల్ల గ్రామంలో కేటీఆర్‌నగర్‌కు చెందిన నేరెళ్ల హరీష్(25) అనే యువకుడు ప్రేమ విఫలమై ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై చిరంజీవి శనివారం తెలిపారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన నేరెళ్ల హరీష్ ఓ యువతిని కొంత కాలం నుంచి ప్రేమించాడు. ఆ అమ్మాయికి వేరే వ్యక్తితో పెళ్లి కుదిరింది. ఈ క్రమంలో తాగుడుకు బానిసైన హరీష్‌ను ఫిబ్రవరి 29న మండలంలోని జగ్గసాగర్ గ్రామంలో ఉన్న బంధువుల ఇంటికి తల్లి తీసుకెళ్లింది. శనివారం ఇంట్లో ఒంటరిగా ఉన్న హరీష్ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

మహిళ ఆత్మహత్య


శ్రీలత(ఫైల్)

జ్యోతినగర్, మార్చి 2: కొడుకు చనిపోతానని బెదిరించడంతో నువ్వు ఎందుకు చనిపోవడం కొడకా..నేనే చనిపోతా అంటూ క్షణికావేశంలో ఓ తల్లి ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్య చేసుకున్న ఉదంతం ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రగతినగర్‌లో చోటుచే సుకుంది. ఎస్ఐ ఉదయకిరణ్ కథనం ప్రకారం.. ప్రగతినగర్‌కు చెందిన పైండ్ల శ్రీలత (40) రవి దంపతులకు రాజ్‌కుమార్, అక్షితలు సంతానం, రాజ్‌కుమార్ హన్మకొండలో డిప్లమో చదువుతున్నాడు. వృధాగా డబ్బులు ఖర్చు పెడుతుండటంతో కొడుకు రాజ్‌కుమార్‌ను తల్లిదండ్రులు మందలించారు. మనస్థాపం చెందిన రాజ్‌కుమార్ తన తల్లి శ్రీలతకు ఈ నెల ఒకటిన రాత్రి ఫోన్ చేసి తన అవసరాలకు ఖర్చులకు డబ్బులు పంపించడం లేదని చనిపోతానని చెదిరించాడు. నువ్వు ఎందుకురా చని పోవడం నేనే చచ్చిపోతా అంటూ తల్లి శ్రీలత క్షణికా వేశంలో ఇంట్లో ఉన్న డీజిల్ డబ్బాలోని డీజిల్‌ను ఒంటి పై పోసుకుని నిప్పంటించుకుంది. గోదావరిఖని ప్రభుత్వ అసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోందని డాక్టర్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెరువులో మునిగి పశువుల కాపరి మృతి

మెట్‌పల్లి రూరల్, మార్చి2 : మండలంలోని వేంపేట గ్రామంలో పశువుల కాపారి కోడి స్వామి(48) ప్రమాదవశాత్తు చెరువులో మునిగి శనివారం మృతి చెందినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. మంచిర్యాల జిల్లా లక్షెట్‌పేట్ మండలంలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన కోడి స్వామి జీవనోపాధి కోసం మండలంలోని వేంపేట గ్రామానికి కొన్ని సంవత్సరాల క్రితం కుటుంబ సభ్యులతో వచ్చాడు. శుక్రవారం పశులవులను మేపుకుంటూ గ్రామంలోని పెద్ద చెరువు సమీపం వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు చెరువులో మునిగిపోయాడు. శనివారం చెరువులో కోడి స్వామి శవమై స్థానికులకు కనిపించగా కుటుంబ సభ్యులకు సమచారం అందించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భవనంపై నుంచి పడి కార్మికుడి మృతి

కరీంనగర్ క్రైం, మార్చి 2: ప్రమాదవశాత్తు కాలు జారి భవనంపై నుంచి కింద పడిన ఒడిస్సా కార్మికుడు అజిత్‌కుమార్ వాస్(34) మృతి చెందాడని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. కరీంనగర్ రేకుర్తిలోని విజయపురి కాలనీలో భూక్య రాజు అనే ఇంటి యజమాని వద్ద సహాయకుడిగా పనిచేస్తున్న అజిత్‌కుమార్ వాస్ శుక్రవారం ఉదయం ఇంటి నిర్మాణ పనుల్లో భాగంగా రెండో అంతస్తుకు వెళ్లి కాలు జారి కిందపడ్డాడు. ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నెలనెలా పొదుపు డబ్బులు వసూలు చేసి మోసం


పోలీసులను ఆశ్రయించిన బాధితులు

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట), మార్చి 2: యూనిక్ కంపెనీ ఏజెంట్ పేరుతో నెల నెల పొదుపు డబ్బులు వసూలు చేసి మోసం చేసిన ఘటన ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. వెంకటాపూర్ గ్రామానికి చెందిన సునీల్ యూనిక్ కంపెనీ ఫేక్ ఏజెంట్ అని తేలడంతో బాధితులు ఆయన ఇంటిని ముట్టడించారు. పొదుపు చేసిన డబ్బులను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుమారు 500 మంది బాధితుల నుంచి మూడు కోట్లకు పైగా డబ్బులు వసూలు చేసినట్లు బాధితులు పేర్కొన్నారు. మోసం చేసిన వ్యక్తి ఇంటిని ముట్టడించిన ఫలితం లేకపోవడంతో న్యాయం చేయాలంటూ బాధితులు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పూర్తి వివరాలు సేకరించి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్సై రమాకాంత్ హామీ ఇచ్చారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

వీణవంక,మార్చి2: మండలంలోని బేతిగల్ గ్రామానికి చెందిన తాటికొండ రమణారెడ్డి ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. నాలుగు రోజుల క్రితం రమణారెడ్డి కుటుంబం హైదరాబాద్‌కు వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయం చుసిన గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు పగలగొట్టి ఇంట్లోకి చొరబ్డారు. బీరువా తెరిచి మంగళహారతులు,కాళ్ళ పట్టీలు, మొలతాడు, దాదపు 55 తులాల వెండి, 16,500 విలువ గల వస్తువులు ఎత్తుకెళ్లినట్టు రమణారెడ్డి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల, మార్చి 2: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచే భక్తులు స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఈవో వెంకటేష్, ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు సునీల్, శ్రీనివాస్‌శర్మ పర్యవేక్షించారు.

వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

హుజూరాబాద్‌రూరల్, మార్చి 2: మండలంలోని ధర్మరాజుపల్లి, రాంపూర్, సిర్సపల్లి గ్రామాల్లో శనివారం జగిత్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ డి. శ్రీలత, డాక్టర్ బి. శ్రీనివాస్, డాక్టర్ బలరాం, డాక్టర్ సాయినాథ్‌లు పర్యటించారు. వరిలో పిలక దశలో మొగి పురుగు ఆశిస్తే పిలకలు ఎండి చనిపోతాయని, వరి పిలక దశలో కార్టప్ హైడ్రోక్లోరైడ్ ఎకరానికి 400 గ్రా. 160-200 లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారి చేయాలన్నారు. అగ్గి తెగుల నివారకు ట్రై సైక్లోజోల్ ఎకరానికి 120 గ్రా. పిచికారి చేయాలన్నారు. ఏడీఏ సునీత, ఏవో సునీల్‌కుమార్, ఏఈవోలు ఉన్నారు.

అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యం పట్టివేత


మెట్‌పల్లిలో నిల్వ చేసిన రేషన్ బియ్యం

మెట్‌పల్లి, మార్చి 2: పట్టణంలో అక్రమంగా నిలువ చేసిన రేషన్ బియ్యంను శనివారం ఎస్సై చిరంజీవి పట్టుకున్నట్లు తెలిపారు. పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన కొండపల్లి మల్లయ్య ఇంట్లో అక్రమంగా రేషన్ బియ్యంను నిలువ చేసిన పక్క సమచారం మేరకు దాడులు చేయడం జరిగిందన్నారు. పట్టణాలు, గ్రామాల్లో తన మనుషులతో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసిన వాటిని తన ఇంట్లో నిలువ చేసి వాటిని ఇతర ప్రదేశాలకు సరఫరా చేయడానికి సిద్ధంగా ఉంచారు. విషయం తెలుసుకొని దాడులు నిర్వహించగా అక్రమంగా నిలువ చేసిన 20క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకొని సాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బియ్యం నిలువ చేసిన కొండపల్లి మల్లయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుకున్న బియ్యంను రెవెన్యూ అధికారులకు అప్పగించనున్నట్లు ఎస్సై తెలిపారు.

ముగ్గురు ఏసీపీల బదిలీ

కరీంనగర్ క్రైం, మార్చి 2: కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో ముగ్గురు ఏసీపీలను బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. కరీంనగర్ సీసీఎస్ ఏసీపీగా పనిచేస్తున్న వి.మాధవి, ట్రాఫిక్ ఏసీపీగా పనిచేస్తున్న ఎండీ సర్వర్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా పనిచేస్తున్న కె.గిరికుమార్‌ను హైదరాబాద్‌లోని చీఫ్ ఆఫీస్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, మార్చి 2:నగరంలో ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు టౌన్ వన్, టు ఏడీఈలు సాయినేని నరేందర్, సుధీర్ కుమార్ తెలిపారు. అంబేద్కర్‌నగర్, బ్యాంక్‌కాలనీ, వావిలాలపల్లి, టవర్ సర్కిల్, వాటర్‌వర్క్స్ హౌసింగ్‌బోర్డు, భగత్‌నగర్, ఉజ్వల పార్క్, ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల, సప్తగిరి కాలనీ, పద్మనగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించగలరని కోరారు.

కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలి

సుభాష్‌నగర్, మార్చి 2: మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వ ఆసుపత్రి వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు బండారి శేఖర్ డిమాండ్ చేశారు. శనివారం ఆసుపత్రి ఆవరణలో జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులకు మూడు నెలలు, హుజూరాబాద్ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులకు 4నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పది రోజుల క్రితం కార్మికులు ఆసుపత్రి వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి, ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందచేసినా ఇంతవరకు జీతాలు రాలేదన్నారు. కార్మికుల జీతాల కోసం రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌ను విడదల చేయాలని కోరారు. పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరుతూ ఈనెల 4న కలెక్టరేట్ ఎదుట దర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు పి అరుణ్, ప్రధాన కార్యదర్శి కళావతి, ఉపాధ్యక్షురాలు ఎన్ శారద, అలీమ్, శంకరమ్మ, నరేష్, రాకేష్, శ్రీను, రవి, ప్రసాద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అచీవర్స్ పాఠశాలలో 'ఫ్యామిలీ ఫన్ ఫీస్టా'



ఆటల్లో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు

గణేశ్‌నగర్, మార్చి 2: కోతిరాంపూర్‌లోని అచీవర్స్ యాక్టివ్ పాఠశాలలో ఫ్యామిలీ ఫన్ ఫీస్టా పేరిట తల్లిదండ్రులకు, అమ్మమ్మ, తాతయ్యలు, నానమ్మలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల డైరెక్టర్ సిహెచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో కుటుంబ బంధాలు తెలుసుకొనేలా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పల్లవి పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడంపై నిషేధాజ్ఞలు పొడిగింపు

కరీంనగర్ క్రైం, మార్చి 2: కమిషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించామని సీపీ అభిషేక్ మొహంతి ఒక ప్రకటనలో తెలిపారు.

● కమిషనరేట్ పరిధిలో డీజే సౌండ్‌ల వినియోగంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను ఈనెల 31వ తేదీ వరకు పొడిగించామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ కమిషనర్ అభిషేక్ మొహంతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

●కమిషనరేట్ పరిధిలో భద్రత కారణాల దృష్ట్యా పారాగైడర్స్, రిమోట్ కంట్రోల్ డ్రోన్స్, రిమోట్ కంట్రోల్ మైక్రోలైట్ ఎయిర్‌క్రాఫ్టుల వినియోగంపై నిషేధాజ్ఞలు ఈనెల 31వ తేదీ వరకు అమలుల్లో ఉంటాయని సీపీ పేర్కొన్నారు.

●కమిషనరేట్ పరిధిలో సంబంధిత ఏసీపీల అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించకూడదని సీపీ పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులు ఈ నెల 31వ తేదీ వరకు అమలులో ఉంటాయని తెలిపారు.

ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం పరీక్షల టైం టేబుల్ విడుదల

గణేశ్‌నగర్, మార్చి 2: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో ఈనెల 12వ తేదీ నుండి 16వ తేదీ వరకు ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం మూడో సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్‌వి శ్రీరంగ ప్రసాద్ తెలిపారు. ఈ పరీక్షలు మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని తెలిపారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, మార్చి 2 : బీసీ స్టడీ సర్కిల్ ద్వారా గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉమ్మడి జిల్లాలోని గ్రూప్-1 నిరుద్యోగ అభ్యర్థులందరూ ఈ ఉచిత శిక్షణ కోసం ఈనెల 7వ తేదీ లోపు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బీజేపీ నాయకుల సంబరాలు



సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

గణేశ్‌నగర్,మార్చి2: పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల మొదటి జాబితాలో బండి సంజయ్ కుమార్ పేరు ప్రకటించడంపై కరీంనగర్‌లో బీజేపీ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. తెలంగాణ చౌక్‌లో టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బోయిన్‌పల్లి ప్రవీణ్‌రావు, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మాడ వెంకటరెడ్డి, సంపత్ రావు,కటకం లోకేష్, దుర్శెట్టి సంపత్, దూల శ్రీనివాస్, ఎండి ముజీబ్, శ్రీనివాస్, కళ్యాణ్ చంద్ర, యువ క్రాంతి పాల్గొన్నారు.

● హుజూరాబాద్: బండి సంజయ్‌కు ఎంపీ టికెట్ రావడంతో పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీజేపీ నాయకులు శనివారం రాత్రి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో గంగిశెట్టి రాజు, కల్లెపు వాసుదేవరెడ్డి, తూర్పాటి రాజు, నల్ల సుమన్, రావుల వేణు, సంజీవరెడ్డి, శశిధర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

● సైదాపూర్: కరీంనగర్ బీజేపీ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిగా బండి సంజయ్‌ను అధిష్టానం ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ నాయకులు శనివారం రాత్రి సైదాపూర్‌లో సంబరాలు జరుపుకున్నారు.

ఒకే సారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు



జంగలపల్లి స్వాతి

గంగాధర, మార్చి 2: ఒకే సారి మూడు ఉద్యోగాలు సాధించి యువతకు స్ఫూర్తిగా నిలిచింది.. గంగాధర మండలం నాగిరెడ్డిపూర్‌కు చెందిన స్వాతి. ఇటీవల విడుదల చేసిన గురుకుల పాఠశాలల ఫలితాల్లో ఏకంగా మూడు ఉద్యోగాలకు ఎంపికైంది. గత నెల 13న విడుదలైన గురుకుల ఫలితాల్లో పీజీటీలో ఉద్యోగం సాధించి సీఎం రేవంత్ చేతుల మీదుగా హైదరాబాద్‌లో నియమాకపత్రం అందుకుంది. మూడు రోజుల క్రితం విడుదల చేసిన ఫలితాల్లో గురుకుల జూనియర్ లెక్చరర్, శుక్రవారం విడుదల చేసిన గురుకుల ఫలితాల్లో టీజీటీ ఉద్యోగం సాధించింది. ఉద్యోగ సాధనకు పెళ్లికి ముందు తల్లిదండ్రులు, పెళ్లి తరువాత భర్త మహేష్ ప్రోత్సాహం ఉందని స్వాతి తెలిపారు.

మూడు ఉద్యోగాలు సాధించిన యువతి



శిరీష

సుభాష్‌నగర్, మార్చి 2: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రా నికి చెందిన గుండం శిరీష గురుకుల ఫలితాల్లో మూడు ఉద్యోగాలు సాధించింది. గత సంవత్సరం ఆగస్టులో గురుకుల బోర్డు నిర్వహించిన పరీక్షల ఫలితాల్లో పీజీటీ (తెలుగు), టీజీటీ, గురుకుల జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలను సాధించింది. ఆమె ప్రస్తుతం కరీంనగర్‌లో నివాసం ఉంటోంది.

రెండు ఉద్యోగాలకు ఎంపిక

కరీంనగర్ టౌన్, మార్చి2: కరీంనగర్ జ్యోతినగర్‌కు చెందిన గుజ్జు రోజ ఇటీవల విడుదలైన గురుకుల టీజీటీ, జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో రెండు ఉద్యోగాలకు ఎంపికైంది. ఈసందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

మాజీ స్పీకర్ శ్రీపాదరావుకు ఘన నివాళి





శ్రీపాదరావుకు నివాళులర్పిస్తున్న మేయర్ సునీల్‌రావు, హుజూరాబాద్‌లో నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్

కరీంనగర్ టౌన్, మార్చి 2: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. నగర పాలక సంస్థ కార్యాలయంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, కమిషనర్ బోనగిరి శ్రీనివాస్‌తో కలిసి శ్రీపాదరావు చిత్రపటానికి బస్టాండ్ చౌరస్తాలో విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మేయర్ యాదగిరి సునీల్‌రావు మాట్లాడుతూ శ్రీపాదరావు మూడు సార్లు శాసనసభ్యునిగా హ్యాట్రిక్ విజయం సాధించి ప్రజలకు సేవలందించిన నాయకుడన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గంట కళ్యాణిశ్రీనివాస్, ఐలేందర్‌యాదవ్, గందె మాధవి మహేష్, తోట రాములు, సల్ల శారదరవీందర్, దిండిగాల మహేష్, బుచ్చిరెడ్డి, నేతికుంట యాదయ్య, సరిల్ల ప్రసాద్, నక్క పద్మకృష్ణ, నాంపెల్లి శ్రీనివాస్, కుర్ర తిరుపతి, అదనపు కమిషనర్ స్వరూపారాణి, ఆర్‌ఓ ఆంజనేయులు పాల్గొన్నారు.

●కరీంనగర్ అర్బన్: డీసీసీ కార్యాలయంలో శ్రీపాదరావు చిత్రపటం వద్ద నాయకులు నివాళులు అర్పించారు. నగరంలోని బస్టాండ్ సర్కిల్‌లోని శ్రీపాద విగ్రహం వద్ద జిల్లా అధ్యక్షుడు, మానకొండూర్ శాసన సభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. సిటి కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందరెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ వేడుకల్లో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్, నాయకులు వైద్యుల అంజన్‌కుమార్, సమద్ నవాబ్, చర్ల పద్మ, ఎండి తాజ్, శ్రావణ్‌నాయక్, కొర్వి అరుణ్‌కుమార్, సిరాజ్ హుస్సేన్, శ్రీనివాస్‌రెడ్డి, అఖిల్, కుర్ర పోచయ్య పాల్గొన్నారు.

●పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో శ్రీపాదరావు చిత్రపటం వద్ద అడిషనల్ డీసీపీ సి.రాజు పూల మాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ శేఖర్ బాబు, సురేష్, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

●హుజూరాబాద్: మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో శ్రీపాదరావు చిత్రపటానికి మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, కమిషనర్ సమ్మయ్య, మేనేజర్ రాంమోహన్‌రాయ్, ఈఈ ప్రభాకర్, ఇన్‌చార్జి ఏఈ సాంబరాజు, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ అశ్వినిగాంధీ, కౌన్సిలర్లు నివాళులర్పించారు.

●జమ్మికుంట: మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, కమిషనర్ ఎండి ఆయాజ్ ఆధ్వర్యంలో శ్రీపాదరావుకు నివాళులర్పించారు. కౌన్సిలర్ మొలుగు ప్రణీత ఆధ్వర్యంలో పద్మశాలీ వాడలో శ్రీపాదరావు జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మొలుగు దిలీప్, ఉడత రమేష్ పాల్గొన్నారు.

●చొప్పదండి: శ్రీపాదరావుకు మున్సిపల్ కార్యాలయంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ నీరజ, కమీషనర్ నాగరాజు పాల్గొన్నారు.

●వీణవంక: ఎంపీడీవో కార్యాలయంలో శ్రీపాదరావు జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రభాకర్ పాల్గొన్నారు.

●సైదాపూర్: ఎంపీడీవో కార్యాలయంలో శ్రీపాదరావు జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీవో యాదగిరి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

●శంకరపట్నం: ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో నల్ల శ్రీవాణి ఆధ్వర్యంలో శ్రీపాదరావు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీవో ఖాజాబషీరుద్దీన్ పాల్గొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రుల సిబ్బందికి శిక్షణ

సుభాష్‌నగర్, మార్చి 2: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రుల సిబ్బందికి ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆరోగ్య సంరక్షణ ప్రమాణాలు, నియంత్రణ సమ్మతిని పెంచే సమిష్టి ప్రయత్నంలో ప్రైవేటు ఆసుపత్రుల ప్రతినిధులతో ఓరియేంటేషన్ నిర్వహించారు. ప్రీ-కాన్సెప్షన్, ప్రీ-నేటర్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్ (పీసీపీఎన్‌డీటీ) చట్టం, మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ (ఎంటీపీ)చట్టం, హస్పిటల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(హెచ్ఎంఐఎస్)పై అవగాహన కలిగించారు. ఎంటీపీ చట్టంలో స్త్రీల పునరుత్పత్తి హక్కులు, ఆరోగ్యాన్ని పరిరక్షించడంపై దృష్టి సారించాలని సూచించారు. హాస్పిట్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌పై అవగాహన కల్పించారు. ఈ పోర్టల్‌ను సమర్థవంతంగా నిర్వహించడంపై వివరించారు. సాధారణ కాన్పులను ప్రోత్సహించాలని సూచించారు. ఆపరేషన్ ద్వారా నిర్వహించే కాన్పుల వల్ల తల్లి బిడ్డకు ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. సాదారణ కాన్పులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో వారిపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం

సుభాష్‌నగర్, మార్చి 2: ఉచిత నేత్ర వైద్య శిబిరం వృద్ధులకు ఉపయోగకరమని మాజీ ఎమ్మెల్యే వుచ్చిడి మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని వృద్ధుల సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్‌లో ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంస్థ అధ్యక్షుడు సముద్రాల జనార్దన్‌రావు మాట్లాడుతూ ప్రతి నెల ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినదనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పెండ్యాల కేశవరెడ్డి, ఉపాధ్యక్షుడు మోసం అంజయ్య, కోశాధికారి చింతల సత్యనారాయణ, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

'ప్రజల గొంతుక ఎంఐఎం'

కరీంనగర్ టౌన్, మార్చి2: పార్లమెంట్‌లో ప్రజల గొంతుక ఎంఐఎం పార్టీ అని నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్ అన్నారు. ఎంఐఎం పార్టీ 66వ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో కుల, మత, వర్గ, లింగ విభేదాలు సృష్టించి బీజేపీ ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతోందన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటి మేయర్ అబ్బాస్ సమి, ఎంఐఎం నగర ప్రధాన కార్యదర్శి బర్కత్ అలీ, జాయింట్ సెక్రటరీలు ఖమ్రుద్దీన్, అతి, కార్పొరేటర్ అఖిల్ ఫిరోజ్, నాయకులు అలిబాబా, అజర్ పసియుద్దీన్, ఖాలీద్, సాజిద్, షకీలుద్దీన్, సలీం, ఎజాజ్, ఖురేషి, హాజీ బాబా, షాకీర్ నహ్వి, అయూబ్ బాజమాల్ తదితరులు పాల్గొన్నారు.

'బీసీ కార్పొరేషన్లకు నిధులు కేటాయించాలి'



అభిషేకంలో పాల్గొన్న భక్తులు

సుభాష్‌నగర్, మార్చి 2: ప్రభుత్వం 11 బీసీ ఫెడరేషన్లు, కార్పొరేషన్లకు నిధులు కేటాయించాలని తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి అధ్యక్షుడు బెల్లాపు దుర్గారావు, ప్రధాన కార్యదర్శి కీర్తి యుగందర్ విజ్ఞప్తి చేశారు. శనివారం నగరంలోని ప్రెస్ భవన్‌లో పార్లమెంట్ నియోజక వర్గ స్థాయి సమా వేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం బీసీ కార్పొరేషన్‌ను బీసీ సంక్షేమ శాఖలో విలీనం చేసిందన్నారు. బీసీ కార్పొరేషన్ ప్రక్షాళన చేసి, సరైన విధానంలో నడిపించవలసిన అవసరం ప్రస్తుత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ. 8000 కోట్ల బడ్జెట్‌ను 11 బీసీ కులాల ఫెడరేషన్లు, కార్పొరేషన్లకు కేటాయించాలని కోరారు. ఆరెకటిక, మేరు, దూదేకుల తదితర బీసీ కార్పొరేషన్లను ఏర్పాటు చేసి బడ్జెట్ కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఈసందర్భంగా కోరారు. ఈ సమావేశంలో వేములవాడ రాజశేఖరచారి, డాక్టర్ రామగిరి లింగయ్య తొవిటి సదానంద చారి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



అభిషేకంలో పాల్గొన్న భక్తులు

కరీంనగర్ కల్చరల్, మార్చి2: నగరంలోని విద్యానగర్ లక్ష్మీవేంకటేశ్వరాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ప్రధానార్చకుడు వానమామలై పవన కుమారాచార్యుల ఆధ్వర్యంలో మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న ఉత్సవాలు శనివారం వైభవంగా ముగిసాయి. ఉదయం మహాపూర్ణాహుతి, అభిషేకం, చక్రస్నానం ఘనంగా జరిగాయి. సాయంత్రం గరుడ వాహనంపై శ్రీవారు ఆలయ సమీప వీధుల్లో విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. రాత్రి శ్రీపుష్పయాగం, ద్వాదశారాధనలు, సప్తావరణాలు, కార్యక్రమాల్లో ఆలయ అధ్యక్ష కార్యదర్శులు శ్రీరాం భద్రయ్య, గుడిపాటి శంకర్‌రెడ్డి, కోశాధికారి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు మడతల మీరయ్య సింగిరెడ్డి రాంరెడ్డి, బానాల మల్లారెడ్డి, కామ అంజిబాబు, ఉప కార్యదర్శులు గడ్డం గోపాల్, గడప సత్యనారాయణ, ఉప కోశాధికారి రుద్రోజు ఉత్తమాచారి, నిర్వహణా కార్యదర్శులు ఊకంటి పాపిరెడ్డి, ఎన్నం మోహన్, సభ్యులు గజవాడ ఆంజనేయులు, బల్మూరి కొండాల్‌రావు, వద్దూరి వేంకటేశం, పాకాల తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రభుత్వ లక్ష్యం



గంగాధరలో గృహజ్యోతి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



అలుగునూర్‌లో గృహజ్యోతి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

గంగాధర, మార్చి2: పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. శనివారం గంగాధరలో నియోజకవర్గస్థాయి గృహజ్యోతి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలు ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. గృహజ్యోతి పథకంలో రాష్ట్రంలో 40 లక్షల మంది వినియోగదారులకు లబ్ధిచేకూరుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన తరువాత రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సమపాల్లలో నడుస్తుందన్నారు. అంతకు ముందు మండలంలోని బూరుగుపల్లి, లింగంపల్లి గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ఆయన పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పుల్కం అనురాధ నర్సయ్య, విద్యుత్ శాఖ ఈఈ రాజుచౌహాన్,ఎస్ఈ గంగాధర్, డీఈ తిరుపతి, ఏడీఈ సత్యనారాయణరెడ్డి, గంగాధర సింగిల్ విండో ఉపాధ్యక్షుడు వేముల భాస్కర్, నాయకులు మనోహర్, కర్ర విద్యసాగర్‌రెడ్డి, గుజ్జుల బాపురెడ్డి ఉన్నారు.

తిమ్మాపూర్: తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతాయని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. అలుగునూర్‌లో శనివారం గృహజ్యోతి పథకంలో భాగంగా 200యూనిట్ల ఉచిత విద్యుత్ జీరో బిల్‌ను అందించే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలలో భాగంగా ఇప్పటికే నాలుగు గ్యారంటీలను ప్రారంభించి ప్రజలకు అందజేస్తుందని అన్నారు. రానున్న రోజుల్లో మరో రెండు గ్యారంటీలను కూడా ప్రారంభించి ప్రజలకు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈ, అలుగునూర్ ఏడీఈ, ఏఏవో, ఏఈలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జీరో విద్యుత్ బిల్లుల జారీ

శంకరపట్నం, మార్చి 2: గృహజ్యోతి పథకానికి అర్హులైన గృహ విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ శాఖ సిబ్బంది జీరో విద్యుత్ బిల్లులు జారీ చేశారు. శంకరపట్నం మండలం తాడికల్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఇప్పలపల్లి, ఆముదాలపల్లి సబ్‌స్టేషన్ పరిధి నల్ల వెంకయ్యపల్లి గ్రామాలలో ఏఈ సంపత్‌రెడ్డి, కుమారస్వామిల ఆధ్వర్యంలో అర్హులైన గృహ వినియోగదారులకు జీరో విద్యుత్ బిల్లులు జారీ చేశారు.

అర్హులైన వారు గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకోండి

● ఎన్‌పీడీసీఎల్ చైర్మన్ కె వరుణ్‌రెడ్డి

హుజూరాబాద్, మార్చి 2: ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని, రానివారు అర్హులు ఉంటే మున్సిపాలిటీ, ఎంపీడీవో కార్యాలయాల్లో మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని టీఎస్ ఎన్‌పీడీసీఎల్ చైర్మన్ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. శనివారం హుజూరాబాద్ పట్టణంలోని విద్యానగర్‌లో గృహజ్యోతి పథకం కింద జీరో బిల్లును లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్ల రేషన్‌కార్డు ఉండడంతో పాటు ఆధార్‌కార్డు, విద్యుత్ కనెక్షన్ నంబర్ జతచేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లపై లోడు అధికంగా ఉంటే సంబంధిత ట్రాన్స్‌కో అధికారులను రైతులు కలిసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈయన వెంట డీఈలు నంది లక్ష్మారెడ్డి, అనిల్‌కుమార్, ఏడీఈ శ్రీనివాస్, టౌన్ ఏఈలు వీరాచారి, శ్రీనివాస్, ఏవో జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సహకారంతోనే నాగార్జున డెయిరీకి ఎక్సలెన్స్ అవార్డు



డెయిరీ చైర్మన్ ప్రభాకర్‌రావును సన్మానిస్తున్న డైరెక్టర్లు, సిబ్బంది, రైతులు

హుజూరాబాద్, మార్చి 2: నాగార్జున డెయిరీలో పనిచేస్తున్న ఉద్యోగుల సహకారంతోనే బిజినెస్ ఎక్సలెన్స్ 2024 అవార్డు వచ్చిందని డెయిరీ అధినేత పుల్లూరి ప్రభాకర్‌రావు అన్నారు. శనివారం హుజూరాబాద్ పట్టణ శివారులోని పరకాల క్రాస్ రోడ్ సమీపంలోని నాగార్జున డెయిరీలో పుల్లూరి ప్రభాకర్‌రావును పాడి రైతులు, సిబ్బంది సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డెయిరీ నెలకొల్పి 18ఏళ్లు గడిచిందని, పాడి రైతుల సహకారంతోనే డెయిరీ అభివృద్ధి చెందిందన్నారు. ఈ అవార్డు రావడానికి డెయిరీలోని ప్రతి ఉద్యోగి, పాడి రైతుల శ్రమ ఉందన్నారు. రాబోయే రోజుల్లో పాడి రైతులకు డెయిరీ తరుపున పాడి ఆవులను, గేదెలను రాయితీ రూపంలో అందిస్తామన్నారు. డెయిరీలో పాల నాణ్యత కోసం మైక్రో బయోలజీ ల్యాబ్‌ను ప్రారంభించారు. అలాగే క్లబ్ సభ్యులు ప్రభాకర్‌రావును శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో డెయిరీ డైరెక్టర్లు ఆహల్య, గణేష్, శృతి, సీఈవో ప్రసాద్, సుధాకర్, వెంకటస్వామి, చొల్లేటి కిషన్‌రెడ్డి, పల్కల శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్, భాస్కర్‌రెడ్డి, రజనీకాంత్, రాజన్న పాల్గొన్నారు.

ఉచిత కంటి శస్త్ర చికిత్సలు

కరీంనగర్ రూరల్, మార్చి2: లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ హంగర్ రిలీఫ్ 320జి లయన్ చింతల కిషన్‌పటేల్ ఆధ్వర్యంలో రేకుర్తి కంటి ఆసుపత్రిలో పలువురికి ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు నిర్వహించారు. కరీంనగర్ రూరల్ మండలంలోని బొమ్మకల్ గ్రామానికి చెందిన బట్టు బుచ్చవ్వ, దానవేణి రాజవ్వ, మధురవేణి రాజవ్వలకు ఆసుపత్రి వైస్ చైర్మన్ చిదుర సురేష్, ట్రస్ట్‌బోర్డు సభ్యుడు కోల అన్నారెడ్డి సహకారంతో ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టెక్నీషియన్ చింతల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

పూజాసామగ్రి అమ్మకానికి టెండర్ల ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్, మార్చి 2: నగరంలోని ప్రశాంతనగర్ ప్రశాంతనగర్ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 6వ తేదీ ఉదయం 11-30 గంటల నుంచి (ఏప్రిల్ 1వ తేదీ నుంచి మార్చి 31, 2025 వరకు సంవత్సర కాలం పాటు) కొబ్బరికాయలు, పూజాసామాగ్రి అమ్ముకునే హక్కు కోసం టెండర్‌ల ఆహ్వానానికి శనివారం దేవాదాయశాఖ సహాయ కమీషనర్ ద్వారా ఉత్తర్వులు పొందినట్లు ఈఓ ఎన్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఔత్సాహికులు ఆలయంలో సంప్రదించాలని, 6వ తేదీ వేలములో పాల్గొనాలని కోరారు.

యజ్ఞవరాహక్షేత్రంలో అధ్యయనోత్సవాలు

కరీంనగర్ కల్చరల్, మార్చి2: నగరంలోని యజ్ఞవరాహ క్షేత్రంలో గురు, శుక్రవారాల్లో అధ్యయనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సర్వవైదికసంస్థానంట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్‌శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు ఉదయం, సాయంత్రం వేద విన్నపం, దివ్య ప్రబంధ సేవాకాలం జరుగుతాయని, శుక్రవారం సాయంత్రం నమ్మాళ్వారు మోక్షోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. ఉత్సవాలు భద్రాద్రి సీతారామచంద్రస్వామి ఆలయ స్థానాచార్యులు స్థలశాయి స్వామి ఆధ్వర్యంలో జరుగుతాయని, భక్తులు పాల్గొని శ్రీవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్

సుభాష్‌నగర్, మార్చి2: మాదిగ రాజకీయ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) జిల్లా అధ్యక్షుడిగా గాలిపెల్లి శ్రీనివాస్‌ను నియమిస్తూ వ్యవస్థాపక అధ్యక్షుడు బిఎస్ రమేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరిస్తున్న వారందరికి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

విశ్వనాథ్ చెస్ అకాడమీ విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 2: జిల్లా కేంద్రంలోని విశ్వనాథ్ చెస్ అకాడమి క్రీడాకారులుఅంతర్జాతీయ చెస్ ఫిడె రేటింగ్ అందుకున్నారు. ఇటీవల కరీంనగర్‌లో జరిగిన కరీంనగ్ ఓపెన్, బిలో-1600 అంతర్జాతీయ ఫిడే రేటింగ్ చెస్ పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చినందుకు గాను విశ్వనాథ్ చెస్ అకాడమి క్రీడాకారులు సిహెచ్ కశ్యప్ 1525 రేటింగ్, సూరజ్ బన్సింగ్ 1440 అంతర్జాతీయ చెస్ రేటింగ్‌లను సాధించారని అకాడమి కోచ్ అంతగిరి విశ్వనాథ్ ప్రసాద్, కొప్పర్తి శివయ్య తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను సినియర్ చెస్ క్రీడాకారులు లోకోజు శ్రీనివాస్, వాస వెంకన్న, కొప్పర్తి శంకర్, మారుతి, సంధ్య మల్లేశం, ఏ రాజేంద్రప్రసాద్ తదితరులు అభినందించారు.

హుజూరాబాద్‌కు చేరుకున్న ప్రజాహిత యాత్ర

హుజూరాబాద్, మార్చి 2: కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ చేపట్టిన ప్రజాహిత యాత్ర శనివారం రాత్రి హుజూరాబాద్‌కు చేరుకుంది. ఆదివారం ఉదయం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎంపీ బండి సంజయ్ ప్రజలనుద్దేశించి మాట్లాడనున్నారు. అనంతరం ఏరియా ఆస్పత్రి, హనుమాన్ దేవాలయం మీదుగా నర్సింగాపూర్, కాట్రపల్లి మీదుగా సైదాపూర్ మండలంలోని అమ్మనగుర్తికి చేరుకుంటారు. ఈయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, గంగిశెట్టి రాజు, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

● హుజూరాబాద్‌రూరల్: ఎంపీ బండి సంజయ్ చేపట్టిన ప్రజాహిత యాత్ర శనివారం రాత్రి హుజూరాబాద్ మండలం చెల్పూర్ గ్రామంలోకి చేరుకోవడంతో బీజేపీ శ్రేణులు, గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. హుజూరాబాద్‌లో ఆదివారం జరుగనున్న బహిరంగ సభకు పార్టీ శ్రేణులు భారీ ఏర్పాట్లు చేశారు.

నియోజకవర్గ స్థాయి పోటీలు

హుజూరాబాద్: ఈ నెల 8న ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు క్రియేటివ్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు పెర్క భాస్కర్, సంఘమిత్ర వాలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు మోరె రంజిత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మానకొండూర్ : మానకొండూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈఅహ్మద్ తెలిపారు. విద్యుత్ లైన్ షిఫ్టింగ్ కోసం ఉదయం 7.30 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

11న మహాదేవాలయంలో కల్యాణోత్సవం

తిమ్మాపూర్: మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల శ్రీ మృత్యుంజయ మహాదేవాలయంలో ఈ నెల 11న శ్రీ గిరిజా మృత్యుంజయ మహాదేవుల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. కల్యాణ మహోత్సవానికి సంబంధించి శనివారం వేదపండితులు పురాణం మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో ఆహ్వాన పత్రిక ఆవిష్కరించారు.

నేటి నుండి కొచ్చగుట్ట బ్రహ్మోత్సవాలు

గంగాధర, మార్చి 2: కొచ్చగుట్ట మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమవుతున్నాయి. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

● సంక్షిప్త సమాచారం..

● తిమ్మాపూర్: మల్లాపూర్ గ్రామ పంచాయతీకి గ్రామ స్థుడు కర్నే బత్తుల మనోహర్ గ్రామ ప్రజల సౌకర్యార్థం సిమెంట్ బెంచీలను వితరణ చేశారు.

● చొప్పదండి: మాజీ ఎంపీ వినోద్‌కుమార్ ప్రత్యేక చొరవతోనే షామీర్‌పేట ఎలివేటెడ్ కారిడార్ మంజూరు అయ్యిందని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం చుక్కారెడ్డి అన్నారు. శనివారం చొప్పదండిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

● మానకొండూర్: మండలంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పల్స్‌పోలియో కార్యక్రమం కొనసాగుతుంది.

● జమ్మికుంట: మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ సన్మాన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను పట్టణంలోని ఎల్లమ్మ గుడి వద్ద గౌడ కులస్థుల ఆధ్వర్యంలో శనివారం ఆవిష్కరించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న-కోటి కౌన్సిలర్లు పాల్గొన్నారు.

● తిమ్మాపూర్: మండల కేంద్రానికి చెందిన మాతంగి కనకయ్య ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలు రామ్ పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు. నాయకులు పోలు రమేష్ పాల్గొన్నారు.